

## సి. హెచ్. కామేశ్వర రావు

"రేపేదీపావళి" అంది శేషమ్మ కొంగు సరుచుకుంటూ.

దోమలబాధ భరించలేక దేహంనిండా కప్పుకున్న దుప్పటి తొలగించి గోపాలం తల్లి వేపు చూశాడు.

గదినిండా చీకటి తాండవిస్తోంది. మునిసిపాలిటీవారి వీథిదీపాల సన్నని కిరణాలు గదిముందున్న వరండాలోకి చుట్టూవున్న అంధకారాన్ని చీల్చుకుని వచ్చాయి. కాని ఆ వరండా దాటి గదిలోకి వెళ్ళలేక పోయాయి. గదిలోకి ప్రవేశించాలని గది గోడతో అవ్యక్తంగా పోరాడుతున్న మసక కిరణాల్ని గోపాలం ఒక్కక్షణం చూశాడు.

"రేపేనా అమ్మా దీపావళి?" అడిగాడు అస్పష్టంగా.

శేషమ్మకి కొడుకు ఏమన్నదీ స్పష్టంగా తెలీకపోయినా ఊహించుకోగలిగింది. గొంతులోనుండి వస్తున్న ఉద్వేగాన్ని బలవంతాన అదిమిపట్టి "అవునురా" అంది.

గోపాలం ఒక్క నిట్టూర్పు విడిచాడు. ఆ నిట్టూర్పులో ఏదో నైరాశ్యం, అశాంతి గోచరించాయి.

"ముప్పైతొమ్మిదవ దీపావళి!" అన్నాడు గోపాలం తనలో తను అనుకున్నట్లుగా— అతని కంఠం కంపించింది.

అతని మూగబాధను తల్లి అర్థంచేసుకుంది. నిజానికి అతని బాధ తెలుసుకునే వ్యక్తి ఆ ఇంట్లో ఆవిడ ఒక్కతె. ఆవిడ దేహంలో ప్రతిఅణువు దహించుకుపోతోంది. కట్టలు తెంచుకు బయటపడదామని ఆవిడలోని ఆవేదన విశ్వప్రయత్నం చేస్తోంది. కాని ఈ జీవితంవల్ల కొడుకు ఎంత సుఖపడుతున్నదీ ప్రత్యక్షంగా చూస్తున్నప్పటికీ, తను బ్రతికున్నంతకాలమైనా కొడుకును కళ్ళఎదుట చూసుకోవాలని ఆవిడ నిరంతర తపస్సు చేస్తున్నందువల్ల తన హృదయంలోని మంటను తనలోనే దాచుకుంది.

"పడుకో బాబూ చాలా ప్రొద్దుపోయింది." అంది.

గోపాలం వదనంమీద ఒక శుష్కహాసం విరిసింది. పడుకో బాబూట!...అతని శరీరం కంపించింది. తను పడుకునేవున్నాడు. గంటల తరబడి, వారాల తరబడి, నెలల తరబడి కాదు...సంవత్సరాల తరబడి. అయినా ఆవిడ పర్యాయపదంలాగ వాడుతూనే వుంటుంది రోజూ పడుకోమని. తల్లే లేకపోతే తన దుర్భర జీవితం అతిదుర్భరమయేది.

గోపాలం పళ్ళు బిగపట్టాడు...ఎలాగైనా సరే తల్లికంటే తను ముందు చనిపోవాలి. ఇందులో తన స్వార్థం వుంటే వుండవచ్చు. కాని తల్లి లేకుండా తను జీవించలేడు. తన చావు ఆవిడకు రంపపుకోత కావచ్చు. కాని రోజూ తనను చూస్తూ ఆవిడ పడుతున్న బాధ ముందు అదేపాటి?

సన్నని గురక వినిపిస్తోంది. ఆ చీకట్లో తల్లి ఆకారం గోపాలానికి లీలగా కన్పించింది. అతని మనస్సు ఆర్ద్రమైపోయింది. తన చిన్నతనంలో ఆవిడగురక తనకిప్పటికీ బాగా గుర్తు. తనకోసం ఆ గురకను పోగొట్టుకోవాలని ఆవిడ చేసిన నిర్విరామకృషి తన హృదయంమీద చెరగని ముద్ర వేసింది.

శేషమ్మ పక్కకు ఒత్తిగిలి పడుకుంది. చర్మానికి అతుక్కునివున్న బొమికలు గచ్చునేలకు పొడుచుకున్నాయి. ఆవిడ ఈ బాధ దేన్నీ గమనించలేని గాఢసుషుప్తిలో పడింది.

బయట వరండాలోని కిరణాలు గది గోడతో పోరాడి అలిసిపోయినై. ఆ కిరణాలు గదిలోనికి రాలేవేమో?

గోపాలం ఆలోచిస్తున్నాడు.

* * *

తనకి పదోఏట 'కీళ్ళవాతం' వచ్చింది.

తల్లి కళ్ళల్లో ప్రజ్వరిల్లిన బాధ తనకళ్ళలో ప్రతిఫలించింది.

"అమ్మో, కీళ్ళవాతమే!" అంది ఒదిన. ఆవిడ కంఠంలో విచారం కన్పించలేదుగాని 'ఈ ఖర్చెట్లా?' అనే సందేహం లీలగా పొడసూపింది.

అన్నయ్యని కూడా ఖర్చు విషయం విషమ పరిస్థితిలో పడేసింది. తను ఆశగా అన్నయ్యని చూశాడు. అన్నయ్య నోటినుండి వచ్చే మాటలకోసం తన చెవులు వెయ్యి చెవులయినయి. ఆ కాసేపు క్షణాలు యుగాలుగా గడిచాయి.

అన్నయ్య తనని, తల్లిని, ఒదినని మార్చి మార్చి చూశాడు. తప్పటడుగులు వేసుకుంటూ వచ్చిన మూడేండ్ల ఆనంద్ మీద ఆయన దృష్టి ఆగింది.

ఒదిన అన్నయ్యను వెర్రిగా చూస్తోంది.

"రేపే మద్రాసు వెళదాం. నిన్ను మనిషిని చెయ్యడానికి నాశక్తంతా వినియోగిస్తాను. అప్పుడుగాని నాన్న ఆత్మకు శాంతి కలుగదు" నెమ్మదిగా అన్నాడు అన్నయ్య.

అమ్మకళ్ళు చెమ్మగిల్లినై.

తనచూపు అన్నయ్య మీదికే ప్రసరించింది. తనచూపులో వ్యక్తమైన అనుభూతిని తను నిర్వచించలేడు. వెయ్యి 'కృతజ్ఞతా' పదాలుకూడ తనకళ్ళల్లో ప్రతిఫలించిన కాంతిని స్పష్టం చెయ్యలేవు.

అన్నయ్య మాటలు విన్న ఒదిన మొహం పాలిపోయింది. జీవంలేని కర్రలాగ అయింది ఆవిడ దేహం.

* * *

గోపాలం ఒక్క నిట్టూర్పు విడిచాడు గతాన్ని తలుచుకుంటూ. మొహం చెమటలు పట్టింది, దుప్పటికప్పుకుంటే వూపిరాడదు, లేకపోతే దోమలు రక్తాన్ని స్వేచ్ఛగా త్రాగుతాయి.

ప్రక్కగదిలోని గడియారం రెండు గంటలు కొట్టింది. అక్కడి గసగుసలు అస్పష్టంగా గోపాలం దగ్గరకు చేరుకుంటున్నాయి. ఉండుండి వినిపిస్తున్న గాజుల చప్పుడు అతని ఆలోచనని రెచ్చగొట్టింది.

* * *

అన్నయ్య చేసిన ఉపకారం తను ఈజన్మలో తీర్చుకోలేడు. అన్నయ్య రెండేళ్ళ కృషి ఫలించింది. తను ఫరవాలేదనిపించుకునే స్థితిలోకొచ్చాడు. మరో రెండేళ్లు గడిచినై. తను రాటు దేలాడు మిసమిసలాడే దేహంతో ప్రతివారిని ఆకర్షించే వాడు తను కాని...

నాన్న చనిపోతూ ముట్టజెప్పిన ఐదెకరాలు హారతికర్పూరంలాగా హరించుకుపోయాయి. ముష్టెత్తుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఎవరో దూరపుబంధువు వ్యాపారం చేస్తూ గుమాస్తాగా వేసుకున్నాడు అన్నయ్యని. అన్నయ్య తెచ్చే వందరూపాయలతో ఇల్లు గడవటమే కష్టంగా వున్నపుడు తను ముందుచదువు ఏం చదవగలడు?

చదువలేను. అవకాశంలేదు. చదువుకోటానికి డబ్బు కావాలి. అదిలేనపుడు ఇంకా ఏమనుకున్నా లాభంలేదు."

కాని ఆ అవకాశం లభించింది. తనని చూసిన దుర్గమ్మగారికి తనకు చేజేతులా జారవిడుచుకోడం ఇష్టం లేకపోయింది. తన తల్లితో శతవిధాల మాట్లాడి ఒప్పించింది.

తనను దత్తత చేసుకుంది.

అవును, తనను దత్తత తీసుకుంది. ఆవిడకెవరూ లేరు; కావలసినంత ఆస్తి తప్ప. తనిప్పుడు ఆ ఆస్తికి సర్వాధికారి.

తను దర్జాగా ఇంటర్మీడియట్‌లో చేరాడు. ఇంటర్మీడియట్ పూర్తయింది.

తనకు పెళ్ళి చేస్తానని పట్టుబట్టింది దుర్గమ్మగారు. తను రెండ్రోజులు నిరాహార దీక్ష పూని ఆవిడని ఆ దృష్టినుంచి తప్పించాడు.

తను యింటర్ ఫస్టు క్లాసులో పాసయాడు. బి. ఏ. లో చేరుదామని ప్రయత్నించాడు. కాని లాభం లేకపోయింది. 'కీళ్ళవాతం' తిరగబెట్టింది. తను మంచం మీదనుంచి దిగటమే గగనమైంది.

దుర్గమ్మగారు సగం ఆస్తి కరిగించింది. తనలోని కీలుకీలు కోయించింది. పూర్వం మంచం మీదనైనా చలనం వున్న కాళ్ళు కర్రలలాగ అయినయి.

దుర్గమ్మగారు ఆ బెంగతోనే కొద్దిరోజుల్లో మరణించింది. తనకెంత ఆస్తి! ఎందుకూ పనికిరాని, ఏం చేసుకోటానికీ వీల్లేని ఆస్తి!

* * *

గడియారం నాలుగు గంటలుకొట్టింది. గోపాలం నిద్రపట్టక మంచంమీద దొర్లుతున్నాడు. వరండాలోని కిరణాలు గదిగోడలతో పోరాడి, అలిసిపోయి, గదిలోనికి ప్రవేశించాలనే ప్రయత్నం నుంచి విరమించుకున్నాయి.

పెళ్ళి! నవ్వుకున్నాడు గోపాలం. తనేం తొందరపడి చేసుకున్నాడు గాదు; మరో జీవితాన్ని బలిచేయవలసి వచ్చేది.

కాలం ఆగదంటారు. నిజమే! పాతిక సంవత్సరాలనుండి అన్నీ మంచంమీదే జరుపుకుంటున్న తను జీవచ్ఛవంలాగ ఈ జన్మ ఘోరంగా నెట్టుకొస్తున్నాడు.

అతని గుండె బరువెక్కింది. కను రెప్పలు నెమ్మదిగా క్రిందికి వాలినయి. కొద్ది సేపట్లోనే అతనికి బాహ్యస్మృతి తప్పింది.

* * *

తిరిగి అతనికి బాహ్యస్మృతి కలిగేసరికి ఉదయం తొమ్మిది గంటలైంది. బద్ధకంగా ఆవులించాడు. రాత్రి దీపకిరణాలు పరాజయం పొందినా, సూర్యకిరణాలు స్వేచ్ఛగా తనమీదకే ప్రసరించినయి. అతనిలో ఏదో చైతన్యం కలిగింది.

ఎందుకుకలుగదూ? ఇవాళ దీపావళి; తన ముప్ఫైతొమ్మిదవ దీపావళి.

"అమ్మా" పిలిచాడు.

శేషమ్మ గబగబా వచ్చింది "లేచావా నాయనా" అంటూ. ఆవిడ అందించిన పళ్ళ పొడి అందుకుని మంచంమీద పడుకొని పళ్ళుతోముకోటం మొదలెట్టాడు గోపాలం.

"ఎలావున్నావు బాబాయ్?" అంటూ పద్మ ప్రవేశించింది; ఆమె ప్రశ్నలో 'ఇంకా బ్రతికేవున్నావా?' అని ధ్వనించింది.

"ఎవరూ? పద్మా...ఎప్పుడొచ్చావు?" గోపాలం ఆశ్చర్యంగా అడిగాడు.

"ఒకగంటయింది."

"శంకరం కూడానా?"

"లేదు" పద్మ ముభావంగా జవాబిచ్చింది.

"అదేం?"

"ఏముంది...నా పుట్టింటికి నేనొచ్చా[ను] ఆయన పుట్టింటికి ఆయన వెళ్లారు" పద్మ నవ్వింది.

గోపాలానికి నవ్వురాలేదు. "అదేమి[టి] పండగపూట ఇద్దరూ ఒక్కచోటవుండక.."

"బాగుంది. నేనేంచెయ్యను? వాళ్ళకి ఎన్ని చెప్పి ఏంలాభం. నన్ను కూ[డా] అక్కడికే రమ్మన్నారు మొదట."

"వెళ్ళలేకపోయావా?"

పద్మ కస్సుమంది. "నేనొచ్చా[నని] కళ్ళల్లో నిప్పులు పోసుకుంటావేం? న[న్ను] నువ్వేం పెట్టిపోషిస్తున్నావు....పడుకొని వాడివి పడుకుని వుండరాదూ..."

కూతురు మాటలు విని జానకమ్మ దొ[డ్డి]నుండి పరుగునవచ్చింది. కూతురు ముక్కు చీదుకుంటూ చెప్పింది. జానకమ్మ [శివ]ప్రమాణాన లేచింది.

"ఏమయ్యా గోపాలం, ఉండదల[చు]కుంటే సరిగావుండు లేకపోతే[...] ముష్టిమూడువేలిచ్చారని పిల్లనింత [...] పడితే అంతమాటంటే వూరుకునేది లేదు[...]"

గోపాలానికి అయోమయంగా [...] ఏవిటీ కూపానికి తోసుకున్నాడు?

"ఇప్పుడు డబ్బు విషయం ఏమొచ్చి[ంది] ఒదినా"

జానకమ్మలో నిప్పులు రగులుకున్నా[యి] వీలైనంత వివరంగా తన అభిప్రాయ[ం] వ్యక్తపరిచింది. గోపాలం బ్రతికుండే [...] నరకమట—అతని ప్రాణానికి విలువలేదట [...] విలువలేనిదానిని వదులుకోవటమే [మంచి]దట...

రామారావు ఆవిడని శాంతింపజేసి తలికి పంపించేసరికి ఎప్పుడో చచ్చిన [...] బ్రతికొచ్చినంత పనైంది. గోపా[లం] అన్నయ్యని అయోమయంగా చూశా[డు] రామారావు ఆకళ్ళల్లోకి సూటిగా [చూడ]లేకపోయాడు.

తమ్ముడు తనకెంత ఆధారంగా [వు]న్నది అతనికి తెలియనిదికాదు. గోపా[లం] కూడా చేయివ్వకపోతే తను పద్మ[ను] ఏనాటికి చేసేవాడో? ఇప్పుడు [...] పెళ్ళికి సిద్ధంగావుంది. తమ్ముడి సహా[యం] లేకపోతే ఈ పెళ్ళి జరుగదు! రామా[రావు] ఉస్సురనుకుంటూ లోనికెళ్లాడు.

# చీకటి వెలుగులు

గోపాలం ఏదీ ఆలోచించే స్థితిలో లేడు. అతనికి బాధగా వుంది. మొహం నిండా చిక్కటి చీకట్లు వ్యాపించినై.

శేషమ్మ కళ్ళనీళ్ళు తుడుచుకుని కొడుక్కు తలంటిపోయడానికి ఉద్యుక్తురాలైంది. చిన్న గుడ్డని కుంకుడురసంలో ముంచి జాగ్రత్తగా తలరుద్దింది. ఒళ్ళు తుడిచింది. తల్లి చేస్తున్న సేవను చూసిన గోపాలం మనస్సు ద్రవించింది.

సాయంత్రం ఆరుగంటలైంది. ఇంట్లో అందరు ఆనంద్ కోసం ఎదురుచూసి, చూసి విసిగిపోయారు.

"వాడి కేంపనులున్నాయో?" అంది శేషమ్మ.

"ఎంత ఇంజనీరైతే మాత్రం పండగపూట ఏం పనులుంటాయి? ఆమహామ్మారి రానిచ్చిందో లేదో?" అంది పద్మ కరుగ్గా.

ఆనంద్ ఇంజనీరు. రామారావు ఆర్థికపరిస్థితినిబట్టి కొడుక్కు ఇంజనీరు చెప్పించలేడు...అతనికి గోపాలం. అతని ఆస్తి అండదండలు లభించాయి.

జానకమ్మ మనస్సేమీ బాగుండలేదు. ఒక్కగానొక్క కొడుకు...వాడి కిష్టమైన పండుగ... పెళ్ళయినప్పటినుంచి తమకు క్రమక్రమంగా దూరమైపోతున్నాడు... జానకమ్మ కడుపులో కెలికినట్లయింది.

"అంతేనంటావుటే?" అంది జానకమ్మ.

"ఇంకా మరేమిటి? ఆవిడ పుట్టింటికి లాక్కెళ్ళినట్లుంది" అంది కూతురు.

జానకమ్మ ప్రాణం "వుసూరు"మంది.

"అక్కా" అంటూ చంపకం వొచ్చింది. "అన్నిట్లోనూ నూనె పోశానే..."

పద్మ చెల్లెల్ని చూసింది. చంపకం చేతుల నిండా నూనె పులుముకుంది. నేలమీదనూ నూనె బొట్లు రాలుతున్నాయి. పైటకొంగునూ నూనె మరకలు కన్పిస్తున్నాయి.

పద్మ నవ్వింది. "ఇంకా చెప్పావేమిటే? బుజాపు కనపడుతుంటేను...ఊ, పద... త్వరగా పెట్టాలి." అక్కా చెల్లెళ్ళు నిష్క్రమించారు.

మసక చీకటిపడుతోంది. హోరు ప్రళయం వొచ్చినట్లు భీకరంగా అరుస్తోంది. చీకట వెలుగుకీ దారుణసంగ్రామం. వెలుగును చూసి భయంతో దూరంగా పారిపోతోంది చీకటి; తన కబంధహస్తాల్లో చిక్కుకున్న వెలుగుని ఆవేశంగా మింగుతోంది చీకటి. చీకటి వెలుగుల సంకులసమరాన్ని చూసి భయంతో వణుకుతున్నాయి దీపాల తోరణాలు.

గోపాలం ఎదురుగావున్న కిటికీలోనుండి చూస్తున్నాడు. ప్రపంచం చాలా అందంగా వుంటుందిట...నిజమేనేమో. తను బయటి ప్రపంచాన్ని చూసి పాతికేళ్ళయింది. తను పుట్టుగుడ్డిగా పుట్టినా బాగుండేది. జీవితాన్ని కొంచెం అనుభవింపచేసి, అందకుండా దూరంగా లాక్కున్నాడు దేవుడు...తనేం పాపం చేశాడో?

అప్పుడప్పుడు తనకే విసుగు పుడుతూ వుంటుంది. ఒకసారి ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. గాలి పీల్చకుండా గట్టిగా బిగపట్టాడు. అరనిముషమైనా అవకముందే ఆవేశంతో గదిలోని గాలంతా పీల్చేశాడు. గోపాలానికి నవ్వొచ్చింది తన బలహీనతకు.

బయట ప్రహరీగోడమీద పద్మ, చంపకం దీపాలతోరణాలు పేరుస్తున్నారు ప్రమిదలతో. ఎంత అందంగా వున్నాయి! కొద్ది దూరంలో మేడమీద కరెంటుతో వెలుగుతున్న బల్బులు కన్పించాయి. ఎంత తేడా! ఇదే కాబోలు సహజత్వానికి, కృత్రిమత్వానికివున్న తేడా!

గోపాలం దీపతోరణాల్ని ఆసక్తిగా చూస్తున్నాడు. నెమ్మదిగా వీస్తున్న గాలికి అటూ, ఇటూ వూగుతూ జీవితానికి అర్థం పలుకుతున్నట్లున్నాయి.

శేషమ్మ అట్లకాడకు మతాబాగుచ్చి, వెలిగించి కొడుకుకు అందించింది. గోపాలం మంచానికివతలగా చేతితో పట్టుకుని కుతూహలంలో చూస్తున్నాడు. రవ్వలు రాలుతున్నాయి; క్రిందపడి మాడిపోతున్నాయి. ఎంత ఉత్కృష్ట జీవితం! జీవితం కొద్ది సెకండ్లే అయినా, ఆ కొద్దికాలం ఎంత మెరుపు! ఎంత ప్రకాశం!

గోపాలాన్ని చూసి పద్మ నవ్వుకుంటూ వెళ్ళింది. జానకమ్మ "కాటికి కాళ్ళు జాచుకున్నా..." అంది వినపడీ వినపడనట్లు.

గోపాలం మొహంనిండా వెలుగు వ్యాపించింది. అతనిలో వెయ్యి జ్యోతులు వెలిగినయి. పెదవులమీద చిన్న మందహాసం విరిసింది.

మతాబా ఆరిపోయింది. గదిలో చీకటి తాండవించింది — కాని గోపాలంలోని వెలుగు చెక్కుచెదరలేదు.

తల్లి అందించిన స్వీటు ఆప్యాయంగా అందుకున్నాడు. జీవితం ఈ స్వీటులాగే ఎంత తియ్యగా వుంది!

తన ప్రాణం తను చేజేతులా తీసుకోలేడు...తీసుకోడు. ఇంకా తను ఎన్ని దీపావళులు చూడాలో? తన జీవితమంతా చీకటి కానీ...ఆ చీకటినంతా మింగివేసే వెలుగు ఒక్క దీపావళినాటిది తనకు చాలు.

గోపాలం కళ్ళు విప్పారినై. ఆ కళ్ళు ఎదురుగా వున్న కిటికీని చూడటంలేదు; కిటికీలోనుండి కన్పిస్తున్న దీపాలతోరణాల్ని చూడటంలేదు; ఎదురుగా వున్న వీధినిండా వ్యాపించిన తెల్లటి వెలుగునీ, నల్లటి పొగనీ చూడటంలేదు — అతని చూపు ఏ కిటికీ అందని ఆకాశాన్ని చీల్చుకుని అనంతంలోకి దూసుకుపోయింది. ★


## ఆంధ్రప్రదేశ్‌లో-

కృష్ణా బ్యారేజి, తుంగభద్ర దిగువ కాలువ, ఎగువ పెన్నా ప్రాజెక్టు, గొంపేరు స్కీము, రాళ్లపాడు ప్రాజెక్టు వంటి ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి అయింది. వాటివల్ల కొత్తగా అనేక ప్రాంతాలు ప్రయోజనం పొందుతున్నవి...

ప్రతి యేటా కొత్తగా వాలుగు వందల గ్రామాలకు విద్యుద్దీపాలు పెట్టబడుతున్నాయి...

బొగ్గు ఉత్పత్తి 1956 లో 17 లక్షల టన్నులు కాగా ఇప్పుడు 21 లక్షల టన్నులు దాటిపోయింది...

రాష్ట్రంలో కొత్తగా నాలుగు వైద్యకళాశాలలు, రెండు ఇంజనీరింగు కళాశాలలు, అనేక సాంకేతిక విద్యాసంస్థలు స్థాపించబడ్డవి...

సామాజికాభివృద్ధి ఉద్యమం మారుమూల గ్రామాలకు కూడా విస్తరించి దినదినాభివృద్ధి గాంచుతూ దేశవిదేశీ ప్రముఖుల ప్రశంసలను పొందుతూ వుంది...

## "ఆంధ్రప్రదేశ్" పత్రికలో-

ఈ సర్వతో ముఖాభివృద్ధి కార్యక్రమం విశేషాలను సమగ్ర వ్యాసాల ద్వారా, ఛాయాచిత్రాలద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ఈ మాసపత్రిక విడిప్రతి వెల 18 నయాపైసాలు. సంవత్సర చందా 2 రూ.ల 16 నయాపైసాలు. పత్రిక ప్రతులను ఏజెంట్లవద్దనుంచి గాని, లేదా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌరసంబంధాలశాఖ డైరెక్టరు కార్యాలయం, హైద్రాబాదునుంచి గాని పొందవచ్చును...

ఆంధ్రప్రదేశ్ పత్రికలో ప్రచురణార్థమై సాహిత్య, సాంస్కృతిక, చారిత్రిక, అభివృద్ధి విషయాలనుగూర్చి రచయితలు వ్యాసములను, కవితలను, కథానికలను, నాటికలను, తదితర రచనలను పంపవచ్చు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌరసంబంధములశాఖ, హైద్రాబాదు.